'కూటమి'గా బతుకులు కూల్చేశారు!

- బీచ్‌రోడ్డులో దుకాణాల తొలగింపు
- రెండు రోజులు గడువు అడిగినా కనికరించని అధికారులు



పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణిని చుట్టుముట్టిన మత్స్యకారులు



పొక్లెయిన్‌ను అడ్డుకున్న మత్స్యకారులు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు రామాద్రి ప్రధాన రహదారి వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పొట్టపై కూటమి ప్రభుత్వం దెబ్బకొట్టింది. ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలు తొలగించడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు. ఇక్కడ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న తమను ఉన్న పళంగా వెళ్లిపోమంటే ఎలాగనీ.. కనీసం రెండు రోజులు సమయం ఇవ్వాలని అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 2017లో ఇక్కడ మత్స్యకారులు నిర్మించుకున్న ఇళ్లను భారీ బందోబస్తుతో వచ్చి తొలగించారని, ఇప్పుడు ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దుకాణాలు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస తుపాన్లు, రింగు వలల సమస్య, వేట విరామ భృతి ప్రభుత్వం అందించకపోవడం, తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు.. రామాద్రి నుంచి తొట్లకొండ బీచ్ వరకు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రోడ్‌లో దాదాపు 45 దుకాణాలు ఉండగా, వీటి ద్వారా సుమారు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాగా.. శనివారం ఉదయం పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు.. పోలీసుల బందోబస్తుతో వచ్చి పొక్లెయిన్లతో దుకాణాలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఇక్కడ ఉద్రిక్తత నెలకొంది. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మూకుమ్మడిగా అధికారులు వచ్చి దౌర్జన్యంగా దుకాణాలు తొలగించడం తగదని మత్స్యకారులు పొక్లెయిన్లను అడ్డుకుని ఆందోళన చేశారు. కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నంబర్‌లో 293లో సుమారు 7 ఎకరాల స్థలంలో భారీ పర్యాటక ప్రాజెక్ట్ వస్తోందని.. అందుకే ఇక్కడ దుకాణాలు తొలగిస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు చెప్పినప్పటికీ.. వారు శాంతించలేదు. సమాచారం అందుకున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి సంఘటనా స్థలం చేరుకున్నారు. దీంతో ఆమెను మత్స్యకారులు ముట్టడించారు. ఇక్కడ వ్యాపారం చేస్తూ బతుకుతున్న తమను వెళ్లిపోమంటే.. ఎక్కడకు వెళ్తామని ఆమెను ప్రశ్నించారు. తమకు రెండు రోజులు గడువు కావాలని ఆమెను కోరినా ఫలితం లేకపోయింది. రెండు రోజుల్లో ఇక్కడ ప్రాజెక్ట్ ప్రారంభంకానుందని.. ఒక్క దుకాణం కూడా ఉంచడానికి వీల్లేదని చెప్పడంతో వారంతా ఆవేదన చెందారు. చివరకు దుకాణాలను తొలగించారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఆయుష్ వైద్య సేవలు మరింత విస్తృతం

నూతన ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మీబాయి



మధురవాడ: ఆయుష్ విభాగంలోని అన్ని రకాల వైద్య సేవలు మరింత మెరుగ్గా అందరికీ చేరువయ్యేలా విస్తృత ప్రచారం చేపడతామని జోన్-1 ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దానేటి ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. మధురవాడలోని ఆర్‌డీడీ కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వై.శేఖర్ విజయవాడ హెచ్ క్వార్టర్స్‌లోని యునాని విభాగం ఏడీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో లక్ష్మీబాయి వచ్చారు. ఈమె ఏపీ సెక్రటేరియట్‌లో ఆరేళ్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ కార్యాలయంలో ఆర్‌డీడీగా పని చేసిన వారిలో మొట్ట మొదటి మహిళా అధికారి, పైగా ఈ జిల్లాలకు చెందిన వారే కావడం విశేషం. ఆమె మాట్లాడుతూ తాను ఈ ప్రాంతంలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆస్పత్రులు, సిబ్బందికి సంబంధించిన సమస్యలు, కావాల్సిన సదుపాయాలపై పూర్తి అవగాహన ఉందని, ఆ అనుభవంతో ఆయుర్వేద, యునాని, హోమియో ఆస్పత్రులు సేవలు అందరికీ మరింత చేరువయ్యేలా చర్యలు చేపడతామన్నారు. అన్ని జిల్లాల్లో డిస్పెన్సరీలు సందర్శిస్తానన్నారు.

అక్రమ నిర్మాణ షాపునకు జీవీఎంసీ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు సాయిప్రియ రోడ్డులో బక్కన్నపాలెం వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ షెడ్డుకు జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ మాస్టర్ ప్లాన్ రోడ్డుకు, ఒక అపార్ట్‌మెంట్‌కు మధ్య సుమారు 300గజాల పైన విస్తీర్ణంలో షెడ్ నిర్మించారు. ఇక్కడ సుమారు 2 నెలల నుంచి నిర్మాణ పనులు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, ప్లానింగ్ సెక్రటరీలు గానీ పట్టించుకోలేదు. ఈ షెడ్ ఏర్పాటు చేసి మల్టీ కార్‌కేర్ షోరూం ప్రారంభోత్సవానికి జీవీఎంసీ రెవెన్యూ ఏడీసీ ప్రోటోకాల్‌తో సహా హాజరయ్యారు. ఈ వ్యవహారంపై 'షాపు అక్రమం..ఏడీసీ ఆశీర్వాదం..!' శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనంపై టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో సచివాలయ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా శనివారం నోటీసు అందజేశారు. అయితే, జీవీఎంసీ టీపీవో పేరుతో దాసరి రమేష్ అనే వ్యక్తికి 5వ తేదీన జారీ చేసినట్లుగా శనివారం నోటీసు ఇవ్వడం కొసమెరుపు.



సాయిప్రియ లే అవుట్‌లో బక్కన్నపాలెం వద్ద అక్రమంగా నిర్మించిన షెడ్

క్లుప్తంగా

గ్రావెల్ అక్రమ రవాణాపై ఆర్డీవో ఫిర్యాదు

కొమ్మాది: గ్రావెల్ అక్రమ రవాణాపై ఆర్డీవో సంగీత్ మాథుర్ భీమిలి సీఐ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. భీమిలి బీచ్ రోడ్డు కె.నగరపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోను, కాపులుప్పాడ కళాగ్రామం సమీపంలోను, తిమ్మాపురం నుంచి మారికవలస మార్గమధ్యలో గల కొండలను తవ్వి అనధికారికండా గ్రావెల్‌ను, రాయిని తరలిస్తున్న 15 మందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఎన్నిసార్లు హెచ్చరించినా పచ్చని కొండలను తొలిచేయడంతో.. ప్రకృతి సంపదైన కొండలు తరిగిపోతున్నాయని వీటిని కట్టడి చేసేందుకు ఫిర్యాదు చేశామని ఆర్డీవో తెలిపారు. ఆ 15 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని సీఐ సుధాకర్ తెలియజేశారు.

బాలిక వైద్యానికి ఆర్థిక సాయం



శ్రీనివాసరావుకు రూ.10 వేలు అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: బాలిక వైద్యం కోసం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందించారు. మద్దిల రాణి అనే బాలిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమె వైద్యం కోసం తండ్రి శ్రీనివాసరావు చాలా ఇబ్బంది పడడంతో, విషయం తెలుసుకున్న ఫ్యాబ్ సభ్యులు వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఫ్యాబ్ సభ్యులు కాళ్ల సన్నీ, ముసునూరి శ్రీనివాసరావు, ఎల్.వి.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తురాజు మహోత్సవం నేడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు వెలంపేట-చిట్టివలస క్రీస్తురాజు దేవాలయం నందు ఆదివారం క్రీస్తురాజు మహోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జపమాల, 2 గంటలకు తేరుతో పురప్రదక్షిణ, 3 గంటలకు అడ్డురోడ్డుకు చెందిన పాస్టర్ యందవ మత్యాస్‌చే ఆరాధన, వ్యాక్య పరిచర్య, సాయంత్రం 4.30 నుంచి పాస్టర్లు పెదపూడి ఆంథోనిరాజ్, సిరికి థామస్, గుజ్జల ప్రసన్నకుమార్‌లచే సమిష్టి దివ్యబలి పూజ సమర్పణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రేమవిందు ఏర్పాటు చేశామని వివరించారు.

గండిగుండంలో ఉచిత వైద్యశిబిరం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. లిఖిత ప్రాథమిక చికిత్స కేంద్రం వద్ద నిర్వహించనున్న శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు లోగిశ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేడుకగా అయ్యప్పస్వామి సన్నిధాన పూజ



అయ్యప్ప స్వామి సన్నిధాన పూజల్లో పాల్గొన్న స్వాములు

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లిలో శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి సన్నిధాన పూజలు వైభవంగా జరిగాయి. సర్పంచ్ గంటా రాజు, చిప్పాడ శ్రీను స్వాము నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి 2500 మందికి పైగా స్వాములు, భవానీలు, శివస్వాములు హాజరయ్యారు. పూజా కార్యక్రమాలు, పేటతుల్లి అనంతరం స్వాములకు కై ంకర్యం ఏర్పాటు చేశారు. పూజల్లో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కులవివక్ష పోరాట సమితి సభ్యులు

భీమునిపట్నం: లా కళాశాల విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర కుల వివక్ష పోరాట సమితి ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు ఎక్కువైపోతున్నాయని, ఇది ఎంతో ఆందోళన చెందాల్సిన విషయమని అన్నారు. గంజాయికి అలవాటు పడినవారు ఎక్కువగా ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం దాన్ని అరికట్టడంతో పాటు ఈ నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు శివ, రాము, లక్ష్మి, రామలక్ష్మి, కృష్ణవేణి, గౌరి పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పరఖ్' సర్వే



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం: విద్యార్థుల చదువు సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి నిర్వహించనున్న విద్య పరఖ్ (పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) సర్వేను ఛాత్రోపాధ్యాయులు జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఈ సర్వే కోసం ఎంపిక చేసిన వారికి స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేలో పాల్గొనే వారు తమకు కేటాయించిన పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల చదువుల సామర్థ్యం ఎలా ఉందన్న దానికి పరీక్ష నిర్వహించాలని సూచించారు. దీనివల్ల పిల్లల సామర్థ్యం ఎలా ఉంది, అవసరమైతే మరింత శ్రద్ధ ఎలా వహించాలనే విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి, అధ్యాపకులు గొట్టేటి రవి, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, పి.ఎ.సోమయాజులు పాల్గొన్నారు.

26న బాల రంగోత్సవ్ నృత్య పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)వద్ద ఈ నెల 26న జాతీయ బాల రంగోత్సవ్ నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు వాద్య కళాకారులతో కలిపి 16 మందికి మించకుండా ఉండాలని పేర్కొన్నారు. కర్రసాము, తప్పెట గుళ్లు, చెంచుల వేట, కర్రసాము, థింసా, జాలరి, బంజారా కళారూపాలలో అంశాలలో పోటీలు ఉంటాయని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొవచ్చన్నారు. విజేతలు 29వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 90524 23757 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తెలగా సేవా సంఘం వన విహారయాత్ర నేడు

తగరపువలస: చిట్టివలస తెలగా సేవాసంఘం పద్మనాభం మండలం కోరాడ పంచాయతీ లింగన్నపేటలోని వేదమాత గాయత్రీదేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వన విహారయాత్ర నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటలకు చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపం వద్ద యాత్ర ప్రారంభించనున్నట్టు సంఘం అధ్యక్షుడు రంగూరి సీతారామదొర తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఆలయం వద్ద కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి



క్రీడా మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో బెలూన్లు ఎగురవేస్తున్న కెప్టెన్ దివాకర్ శంకర్

తగరపువలస: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఉండాలని ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన ఎలక్ట్రికల్ ట్రయల్స్ అండ్ మోడిఫికేషన్ యూనిట్ అధికారి కెప్టెన్ దివాకర్ శంకర్ సూచించారు. భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 16వ వార్షిక క్రీడా మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇతర రంగాలలోనూ విజయాలు సాధించి తోటివారికి ప్రేరణగా నిలవాలన్నారు. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ ఈ ఏడాది రెసిలియన్స్ థీమ్‌తో వారం రోజులు క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. ఉత్సవాల్లో విద్యార్థులు కాన్వాస్ పెయింటింగ్‌తో రూపొందించిన విజువల్ ఆర్ట్ ప్రదర్శన ఆకట్టుకుంది. తైక్వాండో శిక్షణ, డ్రిల్ ప్రదర్శన, మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నృత్యాలు, సంగీతం, కళాత్మక ప్రదర్శనలు అలరించాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలు అందించారు.

సమన్వయంతో దీపోత్సవం విజయవంతం



అనంతుని దీపోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా తదితరులు

పద్మనాభం: అందరూ సమన్వయంతో పని చేసి ఈ నెల 30న జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. అనంతుని దీపోత్సవంపై వివిధ శాఖల అధికారులతో కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో దీపోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపోత్సవానికి వచ్చే భక్తులకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. దీపోత్సవంపై ఇప్పటికే రెండు సార్లు సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలు ఉండడం వల్ల పెట్టలేకపోయామన్నారు. గిరిపై పునర్నిర్మిస్తున్న శిఖరం, ఘాట్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు ఈ నెల 20లోగా పూర్తి చేస్తామని చెప్పిన సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో భీమునిపట్నం ఆర్డీవో సంగీత్ మాథుర్, తహసీల్దార్ కె.ఆనందరావు, ఈవో నానాజీ బాబు, నార్త్ ఏసీపీ అప్పలరాజు, సీఐ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బోని సన్యాసినాయుడు, టీడీపీ నాయకులు కె.దామోదరరావు, నగేష్ కుమార్, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవాన్ సత్యసాయి జయంతి



చిట్టివలసలో బాబా చిత్రపటంతో పల్లకి సేవ



భజనలు చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలు చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. వేకువ జామున నగర సంకీర్తనతో వేడుకలు మొదలయ్యాయి. అనంతరం సత్యసాయి వ్రతాలు, పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ, పల్లకి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నసమారాధన నిర్వహించారు. బాలవికాస్ చిన్నారుల ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం బాబా జీవిత చరిత్రపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భీమిలి, ఆనందపురం మండలాల నుంచి సత్యసాయి సేవాసమితులకు చెందిన పలువురు కార్యక్రమాలలో పాల్గొన్నారు.

పీఎం పాలెంలో..

మధురవాడ: పీఎంపాలెం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కన్వీనర్ సాయిదూత ప్రభాకర్ పర్యవేక్షణలో సత్యసాయి జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. యూత్, బాల వికాస్ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలకు హాజరైన భక్తులు

ఉపాధి హామీ పనుల పరిశీలన



కణమాంలో రికార్డులు పరిశీలిస్తున్న ఉపాధిహామీ అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం కణమాం, శొంఠ్యాం పంచాయతీలలో ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధిహామీ విభాగం డిప్యూటీ సెక్రటరీ ఆశిష్‌గుప్తా, డైరెక్టర్ షణ్ముఖకుమార్ తదితరులు అల్ట్రా అధిక సాంద్రత పనులు, అమృత సరోవర్ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్న చెరువులు, కుంటలను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట డ్వామా పీడీ పూర్ణిమాదేవి, అసిస్టెంట్ పీడీ ఆంజనేయులు, ఎంపీడీవో డాక్టర్ వి.జానకి, ఈసీ తిరుమలరావు, లెంక రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

తగరపువలస: ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో బంటుపల్లి కళావతికి చెందిన పూరిల్లు కాలిపోయింది. బాధితురాలి కుటుంబం వ్యవసాయ పనుల కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమా దం జరగడంతో మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు, గృహోపకరణ, నిత్యావసర వస్తువులు కాలిపోయినట్టు బాధిత కుటుంబ సభ్యు లు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

యువతి ఆత్మహత్య కేసులో యువకుడి అరెస్ట్



మృతురాలు రాశి (ఫైల్)



నిందితుడు రాజు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో కాగితాల రాశి అనే యువతి ఆత్మహత్యకు సంబంధించిన కేసులో అదే పంచాయితీకి చెందిన పిల్లి రాజు అనే యువకుడిని భీమిలి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మృతురాలు మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌లో వలంటీర్‌గా చేసేవారు. ఈ నెల 16న స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన రాశి అపస్మారక స్థితికి చేరుకోవడం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఆమె గడ్డి మందు సేవించినట్టు వైద్యులు తెలియజేశారు. అక్కడ చికిత్స పొందుతూ రాశి 21న మృతి చెందింది. 22న ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మజ్జివలసలో అంత్యక్రియలు పూర్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన భీమిలి పోలీసులు రాశి మృతికి నిందితుడు పిల్లి రాజు కారణంగా గుర్తించి అరెస్ట్ చేశారు. మృతురాలు రాశి ఫోన్‌లో వాయిస్ మెసేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. రాజు పువ్వుల దుకాణంలో పని చేస్తున్నట్టు తెలిసింది.

గెడ్డల్లో నిర్మాణాలు

- స్పందనలో స్థానికుల ఫిర్యాదులు
- జోనల్ కమిషనర్ ఆదేశాలూ బేఖాతర్

మధురవాడ: గెడ్డల్లో కొందరు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో కొండవాలు ప్రాంతాల నీరు సముద్రంలోకి చేరే మార్గాలు కుదించుకుపోతున్నాయి. దీనిపై ఆందోళనతో స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా.. జోనల్ కమిషనర్ ఆదేశాలను కూడా బేఖాతర్ చేసి నిర్మాణాన్ని కొనసాగించడం గమనార్హం. జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం రోడ్డులో టీడీపీ ప్రభుత్వం క్రమబద్ధీకరణ జీవోలో భాగంగా గతంలో పట్టా ఇచ్చిందని చెప్పి ఓ వ్యక్తి గెడ్డను ఆక్రమించి ఈ నెల మొదటిలో నిర్మాణ పనులు ప్రారంభించాడు. బొట్టవానిపాలెం చెరువు, శివశక్తినగర్ కొండవాలు ప్రాంతాలకు చెందిన వర్షం నీరు ఈ గెడ్డ ద్వారా కిందికి ప్రవహించి భగవాన్ దాస్ కాలనీ మీదుగా డంపింగ్ యార్డు ఇతర ప్రాంతాల నుంచి భీమిలి బీచ్‌లో కలుస్తుంది. ఇంతటి పెద్ద గెడ్డ కావడంతో ఇక్కడ నిర్మాణంపై పలువురు జెడ్సీ సింహాచలానికి ఫిర్యాదులు ఇచ్చారు. దీనిపై స్పందించిన జెడ్సీ సదరు నిర్మాణదారుడి వద్ద ఉన్న పట్టాకు.. కడుతున్న స్థలానికి తేడాలు ఉన్నాయని, వాటిని తహసీల్దార్ ద్వారా సరిచేయించుకునేంత వరకు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని ప్లానింగ్ సెక్రటరీని, నిర్మాణ దారుడిని ఆదేశించారు. కానీ జెడ్సీ ఆదేశాలు జారీ చేసి, 10 రోజులు కూడా కాకుండానే నిర్మాణదారులు పనులు ప్రారంభించేశారు. కట్టడం ప్రస్తుతం శ్లాబ్ దశకు చేరుకుంది. ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ గెడ్డ బక్క చిక్కిపోయింది. ఇప్పుడు ఈ నిర్మాణం పూర్తయితే వీధి కాలువ కంటే అధ్వానంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడికి లొంగి అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా తక్షణమే స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నగరంపాలెం రోడ్డులో గెడ్డలో చేపడుతున్న నిర్మాణం

క్యాంపస్ సెలక్షన్లలో 25 మంది ఎంపిక



తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సైన్సెస్‌లో శనివారం ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 100 మంది ఫార్మసీ, డిగ్రీ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎంబీవీ రాజు, మోహనరావు, పిన్నింటి రామకృష్ణ, ట్రైనింగ్ అడ్ ప్లేస్‌మెంట్ అధికారి రణదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గుడివాడలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం గుడివాడ, శ్రీరాంనగర్, పాత చెరకుపల్లి, ఎరుసుపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులకు శనివారం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసింది. పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతి స్వామి విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు ప్రశాంతి, రవి, జనార్దన్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.